క్లుప్తంగా

నేడు పట్నంలో మహంకాళి బోనాలు

ఇబ్రహీంపట్నం: మహంకాళి బోనాల ఉత్సవాలను ఆదివారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలతో తెలిపారు. ప్రతి సంవత్సరం ఆషాఢమాసంలో మహంకాళి అమ్మవారికి, శ్రావణ మాసంలో పోచమ్మ అమ్మవారికి బోనాలు తీయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా మహంకాళి ఆలయానికి రంగులను వేసి అందంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు.

సుద్దపల్లి గ్రామాన్ని మాడ్గుల లోనే ఉంచాలని వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆమనగల్లు: మాడ్గుల మండలంలోని సుద్దపల్లిని నూతనంగా ఏర్పడే ఇర్విన్ మండలంలో కలపకుండా మాడుగులలోనే కొనసాగించాలని సుద్దపల్లి గ్రామ నాయకులు కోరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను ఎంపీటీసీ గ్యార వెంకటయ్య, ఉపసర్పంచ్ శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ జానకిరాములు యాదవ్, నాయకులు శివకుమార్‌గౌడ్, వెంకటేశ్వర్లు, రాములుయాదవ్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా సుద్దపల్లి గ్రామాన్ని మాడ్గులలోనే ఉంచాలని కోరుతూ.. ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు. సుద్దపల్లి నుంచి నూతనంగా ఏర్పడే ఇర్విన్ మండల కేంద్రానికి సరైన రోడ్డు, బస్సు సౌకర్యం లేదని వారు వివరించారు. ఇర్విన్ మండలంలో కలిపితే ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని తెలిపారు.

సత్ప్రవర్తన కలిగి ఉండాలి


రౌడీషీటర్లకు సూచనలు చేస్తున్న సీఐ

ఆమనగల్లు: ఆమనగల్లు పోలీసు సర్కిల్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఆమనగల్లు సీఐ జె.వెంకటేశ్వర్లు కోరారు. రౌడీ షీటర్లు క్రిమినల్ కేసుల్లో పాల్గొంటే.. పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. శనివారం రౌడీ షీటర్లకు సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో ఉంటే వారిపై ఉన్న రౌడీషీట్ మూసివేస్తామని ప్రకటించారు. ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లను బైండోవర్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆమనగల్లు ఎస్ఐ సుందరయ్య పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత

వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి


సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న అనంతరెడ్డి, నాయకులు

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మంగళపల్లిలో రూ.7 లక్షలతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణానికి శనివారం సర్పంచ్ తిప్పిరెడ్డి నర్సింహారెడ్డితో కలిసి జక్కు అనంతరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ.. పల్లెప్రగతి కార్యక్రమంతో గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. సీసీ రోడ్ల పనులను నాణ్యతగా, సకాలంలో పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రామకృష్ణ, నరేందర్, అలివేలు, రాజు, నాయకులు గండికోట శంకర్, మురళి, వెంకటేశ్‌యాదవ్, తానయ్య, నర్సింహ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత ఆకస్మిక మృతి

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సభవట్ కృష్ణనాయక్(48) ఆకస్మికంగా మృతి చెందారు. రేఖ్యతండాకు చెందిన చెందిన ఆయన శుక్రవారం అస్వస్థతకు గురికావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ శనివారం మృతి చెందారు. కృష్ణనాయక్ అంతిమయాత్ర అశ్రునయనాలతో . ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి ఫోన్ ద్వారా కృష్ణనాయక్ కుటుంబసభ్యులను పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు.

ప్రధాని దిష్టిబొమ్మ దహనం

ఆమనగల్లు: రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేసిన స్టే పిటిషన్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించకుండా తిరస్కరణ చేసిన నేపథ్యంలో శనివారం కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మండ్లి రాములు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఖలీల్, మానయ్య, శ్రీశైలం, కృష్ణనాయక్, అలీం, కరీం , సురేశ్‌నాయక్, హరిలాల్, రాఘవేందర్, వస్పుల శ్రీకాంత్, ఫరీద్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఫార్మాతాణా సేవలు జాప్యం?

- నక్కర్తమేడిపల్లిలో కొత్త పోలీస్ స్టేషన్ ప్రారంభం
- నెల రోజులు దాటినా ప్రారంభం కాని సేవలు
- నిత్యం సీఐ, ఎస్ఐలు హాజరు
- నక్కర్తమేడిపల్లికి రాలేమంటున్న కందుకూరు ప్రజలు



నక్కర్తమేడిపల్లిలో ప్రారంభించిన కొత్త ఫార్మాతాణా

యాచారం: కేసీఆర్ సర్కార్ ప్రపంచస్థాయి ప్రమాణాలతో 19,333 ఎకరాల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తుంది. ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫార్మాసిటీకి అంతే రక్షణ కల్పించే విషయంలో సర్కార్ కొత్తగా హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేసింది.కొత్తగా మంజూరైన పోలీస్ స్టేషన్‌ను తాత్కాలికంగా నక్కర్తమేడిపల్లి గ్రామంలో అద్దె భవనంలో ప్రారంభించారు. ఫార్మాసిటీకి భూములు తీసుకున్న యాచారం, కందుకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 19 గ్రామ పంచాయతీలు, వాటి అనుబంధ గ్రామాలను కలిపి ఫార్మా తాణా కింద తీసుకున్నారు. జూన్ 4న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మహేశ్వరం డీసీపీ శ్రీనువాస్‌లు ప్రారంభించారు. కొత్త పోలీస్ స్టేషన్ ప్రారంభించి నెల రోజుల కావస్తున్న నేటికి ఆ పోలీస్ స్టేషన్ నుంచి సేవలు మాత్రం అందడం లేదు. సాంకేతిక పరంగా పూర్తిస్థాయిలో ఆదేశాలు రాకపోవడంతో సిబ్బంది ఏం చేయలేని పరిస్థితి ఉంది. కొత్త ఫార్మా తాణాకు పక్షం రోజుల కిందే సీఐగా రామాంజనేయులు నియమితులైయ్యారు. ఎస్ఐ ప్రసాద్‌తో పాటు మరో 10మంది సిబ్బంది, ఒక మొబైల్ వాహనాన్ని సమకూర్చారు. కానీ, ఈ 19 గ్రామాల్లో జరిగే సంఘటనలు, ఘర్షణలపై స్థానిక గ్రామాల ప్రజలు ఫిర్యాదులు చేయడానికి వెళ్లితే ఫార్మా తాణా సిబ్బంది మళ్లీ యాచారం పోలీస్ స్టేషన్‌కే పంపిస్తున్నారు. పోలీస్ స్టేషన్ ప్రారంభించినా కూడా మళ్లీ యాచారం పోలీస్ స్టేషన్‌కు ఎందుకు పంపిస్తున్నారని ప్రజలు అంటున్నారు.

మేము పోలేం..

నక్కర్తమేడిపల్లిలో కొత్తగా ప్రారంభించిన ఫార్మా తాణాకు మేము పోలేమని కందుకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు అంటున్నారు. కందుకూర్ పోలీస్ స్టేషన్ ఐదారు కిలోమీటర్లు, అదే కొత్త ఫార్మా తాణా 16 నుంచి 20 కిలోమీటర్ల దూరం ఉంటుందని మండల ప్రజలు అంటున్నారు. నక్కర్తమేడిపల్లిలో ప్రారంభించిన కొత్త ఫార్మాతాణాకు మేము పోలేమని కందుకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 10 గ్రామాలకు పైగా ప్రజాప్రతినిధులు కొద్ది రోజుల కింద జిల్లా మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కొత్త ఫార్మా తాణాను కందుకూర్ మండలం మీరాఖాన్‌పేట, యాచారం మండలం కురిమిద్ద గ్రామాల మధ్యను ఏర్పాటు చేస్తే అన్ని గ్రామాలకు మధ్యలో ఉంటుందని, పైగా ఫార్మాసిటీకి ముఖ ద్వారంలో ఏర్పాటు చేసినట్లు అవుతుందని మంత్రికి తెలియజేశారు. కందుకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజాప్రతినిధుల ఫిర్యాదుల నేపథ్యంలోనే నక్కర్తమేడిపల్లి గ్రామంలో ప్రారంభించిన కొత్త పోలీస్ స్టేషన్ సేవల్లో జాప్యం జరుగుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొత్త ఫార్మా తాణాకు శాశ్వత భవన నిర్మాణం కోసం కూడ నక్కర్తమేడిపల్లి గ్రామ సమీపంలో కావాల్సిన స్థలాన్ని టీఎస్ఐఐసీ కేటాయించినట్లు తెలుస్తోంది. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన పోలీస్ స్టేషన్ నిర్మించాలనే ఆలోచనలో సర్కార్ ఉంది.

“రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో



నక్కర్తమేడిపల్లిలో నెల కింద ప్రారంభించిన కొత్త ఫార్మాతాణా నుంచి రెండు రోజుల్లో అన్ని రకాల సేవలు ప్రారంభిస్తాం. నిత్యం పోలీస్ స్టేషన్‌లోనే ఉంటున్నాం. పోలీస్‌స్టేషన్‌లో పూర్తి సేవలు ప్రారంభమైతే కందుకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు వస్తారో.. రారో తెలుస్తుంది. ప్రజలకు సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తాం.

– రామాంజనేయులు, సీఐ ఫార్మా తాణా

కులవృత్తులకు ప్రభుత్వం చేయూత


ఎమ్మెల్యే కిషన్‌రెడ్డిని కలిసిన శాలివాహన సంఘం నాయకులు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కుల వృత్తులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం శాలివాహన కుల వృత్తిదారులు (కుమ్మర) ఎమ్మెల్యేను ఆయన నివాసం కలిశారు. కుల వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఆయన మాట్లాడుతూ.. వృత్తిదారులకు ఆర్థిక ప్రోత్సాహం అందించడానికి ప్రభుత్వం పథకాలు రూపకల్పన చేస్తుందన్నారు. మహాత్మాజ్యోతిబాపూలే ఓవర్‌సిస్ విద్యా పథకం ద్వారా విదేశీ విద్యనభ్యసించే విద్యార్థులకు రూ.20 లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తుందని వివరించారు. కురుమ, యాదవ కులస్తులకు గొర్రెల పంపిణీ ,ముదిరాజ్, గంగపుత్రులకు ఉచితంగా చేపపిల్లలు ఇచ్చి ఆదుకుంటుందన్నారు. గౌడ కులస్తులకు వైన్స్ దుకాణాల్లో 15 శాతం వాటాలు ఇస్తుందని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, శాలివాహన సంఘం అధ్యక్షుడు జంగయ్య, సర్పంచ్‌లు రాంరెడ్డి, యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు పార్టీ కొండంత అండ

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు సభ్యత్వం కొండంత అండని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఉప్పరిగూడకు చెందిన పార్టీ కార్యకర్త సుగుణమ్మ మరణించింది. శనివారం ఆమె కుమార్తె రాధికకు రూ.2 లక్షల ప్రమా ద బీమా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాంరెడ్డి, ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి,నాయకులు గోపాల్, శ్రీరామ్, మహేందర్ పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు చేర్చాలి

ఎంపీపీ కృపేష్


సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ కృపేష్ తదితరులు

తుర్కయంజాల్: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకువెళ్లాలని ఎంపీపీ, తుర్కయంజాల్ 21వ వార్డు ఇన్‌చార్జి కృపేష్ అన్నారు. శనివారం పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్ వార్డు అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశానికి కృపేష్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదేశాలను ప్రతి కార్యకర్త పాటిస్తూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెవుల దశరథ, మున్సిపాలిటీ యువజన విభాగం అధ్యక్షుడు కొత్తకుర్మ కార్తీక్, నాయకులు జోన్నాడ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కడ్తాల్: మండలంలోని చరికొండలో ఇటీవల తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందిన గీత కార్మికుడు వల్లపుదాస్ నర్సింహగౌడ్ కుటుంబానికి పలువురు దాతలు, కాంగ్రెస్ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక ఎంపీటీసీ పాలకూర్ల రాములుగౌడ్ రూ.10 వేలు, చరికొండ గౌడ సంఘం రూ.33 వేలు, యువతరం యూత్ తరపున రూ.30 వేలు, మండల కాంగ్రెస్ కమిటీ రూ.5 వేలు, కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి రూ.5 వేలు, చరికొండ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండల్ రూ. 3 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు.గ్రామస్తులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్సీ, నాయకులు

కడ్తాల్: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని మైసిగండికి చెందిన మోత్యానాయక్‌కు రూ.1లక్ష, ముద్వీన్ గ్రామానికి చెందిన అలివేలుకు రూ.29 వేలు, శివలీలకు రూ.15 వేలు, మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఆంజనేయులుకు రూ.36 వేలు, తలకొండపల్లి మండలం రాంపూర్‌కు చెందిన జంగయ్యకు రూ. 12 వేలు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు మంజూరయ్యాయి. శనివారం ఎమ్మెల్సీ నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆపదలో ఉన్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మోత్యానాయక్, రమేశ్, సురేందర్‌రెడ్డి ఆయా మండలాల నాయకులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న నాయకుడు కురుమయ్య

సీఐటీయూ జిల్లా నాయకుడు కురుమయ్య

కడ్తాల్: గ్రామాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, సీఐటీయూ జిల్లా నాయకులు గుమ్మడి కురుమయ్య డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం మూడవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కురుమయ్య మాట్లాడుతూ.. జీఓ 60 ప్రకారం ప్రతి కార్మికుడి వేతనాలు పెంచాలని , స్వీపర్లకు రూ.15,600, కారోబార్, బిల్‌కలెక్టర్, ఎలక్ట్రీషియన్, డ్రైవర్లకు రూ.19,500 వేతనం ఇవ్వాలని కోరారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారంతో పాటు, వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఆదాయం ఉన్న పంచాయతీల్లో వేతనాల పెంపునకు అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ కో-కన్వీనర్ ఆశీర్వాదం, జీపీ కార్మికులు నరేశ్, భారతమ్మ, రాములమ్మ, వెంకటమ్మ, రవి, సుగుణమ్మ, మరియమ్మ, లక్ష్మి, సరస్వతి, చంద్రకళ, హంసమ్మ ఉన్నారు.

మూడో రోజు కొనసాగిన సమ్మె

యాచారం: ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె శనివారం మూడో రోజుకు చేరింది. పంచాయతీ సిబ్బంది సమ్మెకు మద్దతుగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్, బ్రహ్మయ్యలు పాల్గొన్నారు. ప్రాణాలను లెక్క చేయకుండా పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించి, నెలకు రూ. 25 వేలకు తగ్గకుండా జీతం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

పంచాయతీ కార్మికులకు న్యాయం చేయాలి

మంచాల: గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కారం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోశమోని కృష్ణ అన్నారు. శనివారం పంచాయతీ కార్మికుల సమ్మెకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కారం చేస్తామని చెప్పిన పాలక ప్రభుత్వం ఏళ్లు గడిచినా పట్టించుకోవడం లేదన్నారు. వెట్టి చాకిరి చేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ యూనియన్ జేఏసీ చైర్మన్ పాండు, ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా పాషా, భాస్కర్, నాయకులు జంగయ్య, శంకరయ్య, సురేష్, వెంకటేష్, స్వరూప, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

గట్టుఇప్పలపల్లిని మండలం కేంద్రంగా చేయాలి

తలకొండపల్లి: ఉద్యమం మరింత ఉధృతం చేసి మండలం సాధించి తీరుతామని జేఏసీ నాయకులు అన్నారు. మండలంలోని గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు శనివారం ఆరో రోజుకు చేరింది. అభివృద్ధిలో గ్రామం ముందంజలో ఉన్నా మండలం ఎందుకు ఏర్పాటు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో 41 రోజులు నిరహార దీక్షలు చేశామని, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ దీక్షా శిబిరాన్ని సందర్శించి మండలం ఏర్పాటు చేస్తామని స్పష్టమైన హామీచ్చారు.కార్యక్రమంలో జేఏసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

తలకొండపల్లి: సీఐ వెంకటేశ్వర్లును బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కుమ్మరి శంకర్ శనివారం ఘనంగా సన్మానించారు. ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తోన్న ఉపేందర్ ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన సీఐగా వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్‌తో పాటు, నాయకులు ఆమనగల్లుకు వెళ్లి సీఐ వెంకటేశర్లును మర్యాదగా కలుసుకున్నారు. అనంతరం పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుందరయ్య, మాజీ ఎంపీటీసీ రవి, పడకల్ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజయ్యగౌడ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

యాచారం: మండలంలోని నందివనపర్తి ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలకు చెందిన 2002-03 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు అప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి , నందివనపర్తి మాజీ సర్పంచ్ వర్త్యవత్ రాజునాయక్ ఉన్నారు.

గురునానక్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్


ఒప్పంద పత్రం చూపుతున్న ఎండీ సైనీ

ఇబ్రహీంపట్నం: మండలం సమీపంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆల్టెయిర్ కంపెనీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను స్థాపించింది. శనివారం గురునానక్ విద్యాసంస్థ ఆల్టెయిర్ ఆకాడమిక్ ఇన్సియేటివ్స్ ప్రధానాధికారి(హెడ్) బీఎస్ రమేషా సందర్శించి ఈ ఎక్సలెన్స్‌ను స్థాపించారు. పలు పరిశ్రమల్లో గురునానక్ విద్యాసంస్థలు భాగస్వామ్యం కలిగి ఉండడం, నైపుణ్యం కలిగిన విద్యార్థులుండడంతో ఈ ఎక్సలెన్స్‌ను ఇక్కడ స్థాపించాలనే మక్కువ కలిగినట్లు తెలిపారు. ఆ విద్యాసంస్థల వైస్ చైర్మన్ గగన్‌సింగ్ కోహ్లి మాట్లాడుతూ.. యువతకు పరిశ్రమల ద్వారా ఉపాధిని అందించడం కోసం కష్టపడుతున్నట్లు చెప్పారు. ఆ విద్యాసంస్థల ఎండీ హెచ్‌ఎస్ సైనీ మాట్లాడుతూ.. పరిశ్రమ ఆధారిత నైపుణ్యాలను విద్యార్థులు నేర్చుకోవడానికి, ప్లేస్‌మెంట్‌ల్లో సహాయపడానికి ఈ కేంద్రం ఎంతో సహాయపడుతుందని అన్నారు. రాష్ట్రంలో అల్టెయిర్‌తో ఇలాంటి కేంద్రాన్ని ఏర్పాటు చేసిన మొదటి సంస్థ గురునానక్ విద్యాసంస్థలేనన్నారు.

ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలి

టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతి ఒక్కరు క్రీడల్లో రాణించాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. కొంగరకలాన్ ప్రీమియం లీగ్ ఎలుగని శరవయ్య జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి విజేతలకు బహుమతలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటల్లో ప్రతి ఒక్కరు రాణించాలని తెలిపారు. గెలుపోటములు సమానంగా స్వీకరించాలని చెప్పారు. ఆటల ద్వారా స్నేహపూర్వక వాతావరణం కల్గుతోందన్నారు. కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఆర్తిక, ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ మహిపాల్ ,టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, మున్సిపాలిటీ అధ్యక్షుడు బాల్‌రాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, భానుచందర్, కిషోర్, సుమన్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ మరమ్మతులు పూర్తి చేయండి


ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసుయాదవ్, తదితరులు

బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌యాదవ్

తలకొండపల్లి: మండలంలోని వెల్జాల్‌లో అసంపూర్తిగా ఉన్న విద్యుత్ పనులను పూర్తి చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం విద్యుత్ ఏడీ శ్రీనివాసురావుకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని విద్యుత్ లైన్లను పరిశీలించి ఎక్కడెక్కడ వైర్లు కిందికి వేలాడుతున్నాయి, హై, లోటల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్ల పని తీరును పరిశీలించి తగిన మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటానని ఏడీ చెప్పారు. అనంతరం మండలంలోని సంఘాయిపల్లి, వెల్జాల్‌లో పలువురు మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను శ్రీనివాసుయాదవ్ పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ ముజిబర్ రహ్మాన్, విష్ణువర్ధన్, వెంకటయ్య, దస్తగిరి, శ్రీశైలం, పరంధాములు, సత్యం, రాజేందర్‌రెడ్డి, అవినాశ్, మోహన్‌లాల్ పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాతకు ఘన నివాళి

దివంగత ముఖ్యమంత్రి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని శనివారం ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లోని ఆయన విగ్రహాలకు వైఎస్సార్ అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నివాళి అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం పొందారని తెలిపారు.


కడ్తాల్: జయంతి వేడుకల్లో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు


మంచాల: లింగంపల్లిలో వైఎస్ఆర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు


ఆమనగల్లు: వైఎస్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు


రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌కాంగ్రెస్ నేతలు


తలకొండపల్లి: వైఎస్ఆర్ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు


యాచారం: వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌టీపీ శ్రేణులు